సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం | 8 | నవంబర్ | 2023



లాభాల వలవేసి.. డబ్బు లాగేసి

కమీషన్‌ల పేరు చెప్పి.... కళ్లెదుటే లాభాలు చూపి.. బోనస్‌లు, ఇన్సెంటివ్‌లతో ప్రజలను మోసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. -10లో



భార్యపై భర్త హత్యాయత్నం

కట్టుకున్న భార్యపై అతి కిరాతకంగా గొంతు కోసి చంపేందుకు భర్త ప్రయత్నించిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.360
రెండోరకం	రూ.160	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 197 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బీటీ కాలేజీ సందర్శన



ఠాగూర్ కాటేజీని తిలకిస్తున్న ఏపీ పోలీస్ అడిషనల్ డీజీ ప్రతాప్‌రెడ్డి

మదనపల్లె సిటీ: ప్రముఖ చారిత్రాత్మక బీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంగళవారం ఏపీ పోలీస్ అడిషనల్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. కాలేజీలోని గ్రంథాలయం, కాలేజీ కార్యాలయం,రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం, కాటేజీని పరిశీలించారు. కాటేజీలో విజిటర్స్ పుస్తకంలో సంతకం చేశారు. కాలేజీ గురించి ప్రిన్సిపాల్ ఆనంద్‌రెడ్డి వివరించారు. అనిబిసెంట్ స్థాపించారని, రవీంద్రుడు జాతీయగీతం అనువాదం గురించి తెలియజేశారు. కాలేజీలోని చారిత్రక భవనాలు పరిశీలించారు. కాలేజ్ సర్వీస్ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రేమచంద్రారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి కాలేజీని యూనివర్సిటీగా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి, ఎస్.ఐ హరిహరప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా

వైవీయూ/ఏఎఫ్‌యూ: విద్యార్థి, యువజన సంఘాలు ఈ నెల 8న విద్యా సంస్థల బంద్ చేపట్టిన నేపథ్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ 2వ సెమిస్టర్ పరీక్ష, ఎంఈడీ పరీక్ష వాయిదా వేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. డా.వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో బుధవారం నిర్వహించాల్సిన యానిమేషన్ మూడో సెమిస్టర్, ఆర్కిటెక్చర్ 5వ, 6వ సెమిస్టర్, ఫొటోగ్రఫీ విభాగం 7వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్ తెలిపారు.

9న పురంధేశ్వరి పర్యటన

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధరేశ్వరి ఈ నెల 9, 10 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణరెడ్డి తెలిపారు. కడప బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 8న సాయంత్రం జిల్లాకు వస్తారని, 9న కొప్పర్తి ఎలక్ట్రానిక్ పరిశ్రమ, అనంతరం వల్లూరులో పొలాలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం కడపలోని విష్ణుప్రియ కళ్యాణమండపంలో జరిగే సభలో పాల్గొంటారన్నారు. సాయంత్రం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారన్నారు.

శైవ క్షేత్రాలకు బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్తీక మాసంలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు ఈ సర్వీసులు నడుస్తాయన్నారు. కడప, పులివెందుల, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, ప్రొద్దుటూరు డిపోల నుంచి అరుణాచలానికి 36 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. పొలతల, నిత్యపూజకోన, లంకమల, అల్లాడుపల్లె, అగస్త్యేశ్వర కోన, భానుకోట, కన్యతీర్థం, యాగంటి, అత్తిరాల, శ్రీశైలం, మహానంది తదితర క్షేత్రాలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

వర్ష సూచన

కడప అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాల్లో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ఒక మాదిరి నుంచి తేలికపాటి వర్ష సూచన ఉందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. అన్ని మండలాల్లో తేలికపాటి వర్ష సూచన ఉందని వారు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, డిప్లొమా ఉత్తీర్ణులై 18–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 10–40 వేల వరకు హోదానుబట్టి వేతనం ఉంటుందన్నారు. ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతులకు రైతుభరోసా మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

- వరుసగా ఐదో ఏడాది రెండోవిడత రైతుభరోసా పంపిణీ
- జిల్లాలో 2లక్షల57వేల మంది రైతులకు రూ.83.73 కోట్లు పంపిణీ
- మదనపల్లెలో రైతులకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె: రైతు దేశానికి వెన్నెముక అన్న మాటను నిజం చేస్తూ...వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి అడుగులోనూ అన్నదాత సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. నాలుగున్నరేళ్లలో వ్యవసాయరంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అన్నదాతకు అండగా నిలిచి, రైతన్న తల ఎత్తుకుని తిరిగేలా చేశారన్నారు. వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ ఐదో ఏడాది రెండోవిడత పెట్టుబడి సాయాన్ని అందించే కార్యక్రమం జిల్లాస్థాయిలో బుధవారం మదనపల్లె జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. శ్రీ సత్యసాయిజిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న వైఎస్సార్ రైతుభరోసా– పీఎం కిసాన్ రెండోవిడత పంపిణీ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎల్‌సీడీ స్క్రీన్‌పై రైతులతో కలిసి ఎమ్మెల్యే నవాజ్‌బాషా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నవాజ్‌బాషా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన మొదటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. విత్తనం నుంచి పంట అమ్మకం వరకు రైతుకు అండగా నిలిచేందుకు ప్రతి గ్రామంలోనూ ఆర్‌బీకేల ఏర్పాటుతో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారన్నారు. వ్యవసాయం దండగని, రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాలని చెప్పిన చంద్రబాబు, నేడు ఎన్నికలు దగ్గర పడేసరికి రైతులపై ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తూ మోసగించేందుకు ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలన అంతా స్కామ్‌లే తప్ప స్కీమ్‌లు లేవని, 30 ఏళ్ల అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రి అని చెప్పుకునే పెద్దమనిషికి జగనన్నలా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఆర్డీఓ ఎం.ఎస్.మురళి మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ... తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు, దిగుబడులు ఆర్జించేందుకు రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపాలన్నారు. జిల్లా ఉద్యాన అధికారి రవీంద్రబాబు, ఏడీఏ దీక్షాకుమారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎంపీపీలు రెడ్డెమ్మ, నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజా, కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, వెలుగుచంద్ర, వైస్ ఎంపీపీ రమణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హాజరైన రైతులు

పూర్తయిన పీబీసీ పనులు

- చెర్లోపల్లె నుంచి కృష్ణా జలాలు రాక
- 10 ఎంసీఎఫ్‌టీ నీళ్లు చెరువులకు



శెట్టిపల్లె వద్ద పూర్తయిన కాలువ మరమ్మతు పనులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట సమీపంలోని శెట్టిపల్లె వద్ద హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ అక్విడెక్టు పనులు పూర్తయ్యాయి. గతనెల 29 తెల్లవారుజామున అక్విడెక్టు అంచు తెగిన విషయం తెలిసిందే. దీనిపై అనుమానం వ్యక్తం చేస్తూ ప్రాజెక్టు జేఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కాలువ తెగిపోవడంతో అధికారులు వీటికి మరమ్మతులు చేయించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. వీటి పనులు మంగళవారం పూర్తయ్యాయి. పనులు పూర్తయ్యే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సత్యసాయిజిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి ముందుగానే కృష్ణా జలాలను పుంగనూరు ఉపకాలువకు మళ్లీ విడుదల చేశారు. ఆదివారం నుంచి నీటిని విడుదల చేయగా బుధవారం రాత్రి లేదా గురువారం కృష్ణా జలాలు బి.కొత్తకోటకు చేరునున్నాయి. నీటిని నేరుగా కాలువలోకి ప్రవహింపజేయనున్నారు. శెట్టిపల్లె వద్ద కాలువ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కాలువలో ఎక్కడైనా లోపాలపై పరిశీలించి మరమ్మతు పనులు పూర్తి చేయించేలా చర్యలు చేపట్టామని ప్రాజెక్టు ఎస్ఈ సీఆర్.రాజగోపాల్ చెప్పారు. నీళ్లను కుప్పం ఉపకాలువకు తరలిస్తామని చెప్పారు. కాలువ చివరి అంచుకు చేరాక నీటిని దిగువన ఉన్న చెరువులను నింపుకొంటూ వస్తామని, నీటి తరలింపును బట్టి చెరువులకు మళ్లిస్తామని చెప్పారు. శెట్టిపల్లె వద్ద నుంచి కృష్ణా జలాలు రంగసముద్రం, తిప్పసముద్రం చెరువులకు 10 ఎంసీఎఫ్‌టీల నీళ్లు చేరినట్టు చెప్పారు.

ఉపాధ్యాయులు సమయం పాటించాలి

డీఈవో శ్రీరాం పురుషోత్తం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

రాయచోటిటౌన్: సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డీఈవో శ్రీరాం పురుషోత్తం ఉపాధ్యాయులను హెచ్చరించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని కొత్తపల్లెలోని ఉర్దూ ఉన్నత పాఠశాలను మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో ఉపాధ్యాయులు కొంత మంది ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుడు కూడా ఆ పాఠశాలలో లేరు. కొద్దిసేపటికి పాఠశాలకు డీఈవో వచ్చారనే విషయం తెలుసుకున్న ఒక్కొక్కరే ఉపాధ్యాయులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే 10వ తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. సరైన సమాధానాలు చెప్పలేకపోవడంతో సంబంధిత ఉపాధ్యాయులను పిలిచి ఇప్పటికీ సరైన బోధన చేయలేదని ఇక్కడ వచ్చేది పేద విద్యార్థులు కాబట్టి వారిని నాణ్యమైన విద్యా బోధన చేయాలని సూచించారు. త్వరలోనే మళ్లీ ఆకస్మిక తనిఖీ చేయడానికి వస్తానని అప్పటికైనా విద్యార్థులలో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని సూచించారు. అలాగే మరుగుదొడ్ల పారిశుధ్య నిర్వహణపై కూడా మండిపడ్డారు. అలాగే నాడు – నేడు పనులకు సంబంధించి రికార్డులు తన కార్యాలయానికి తీసుకరావాలని ఆదేశించారు.

స్కౌట్ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి

కలెక్టర్ , ఎమ్మెల్యే



స్కౌట్ అండ్ గైడ్స్ ఫౌండేషన్‌డే స్టిక్కర్ల పోస్టర్‌ను ఎమ్మెల్యేకు అందజేస్తున్న స్కౌట్ విద్యార్థులు

రాయచోటి అర్బన్: స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు క్రమశిక్షణతో రోల్‌మోడల్‌గా ఎదగాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆకాంక్షించారు. భారత్ స్కౌట్అండ్ గైడ్స్ 74వ ఫౌండేషన్ డే పురస్కరించుకుని స్కౌట్స్ జిల్లా సెక్రటరీ మడితాడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్కౌట్ అధికారులు, విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. స్కౌట్అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే స్టిక్కర్ల పోస్టర్‌ను అందచేశారు.

స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి కోరారు. స్కౌట్స్ జిల్లా సెక్రటరీ మడితాడి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో స్కౌట్ అధికారులు, విద్యార్థులు ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి, నైతికవిలువలు ,సామాజిక సేవాతత్వం పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం, డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

రాయచోటి: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ దిశగా జిల్లాలో అధికారులు ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ విజయవంతం చేయాలి

ఈ నెల 9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రతి మండలంలో ప్రతి రోజు ఒక సచివాలయంలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎస్పీల సమీక్ష



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్

రాయచోటి/పులివెందుల రూరల్/ వేంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయచోటి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సీఎం రాకపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం కుమారుడి వివాహ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఈనెల 9న రాయచోటికి వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యటకు సంబంధించిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సీఎం వెళ్లే రహదారి పొడవునా సచివాలయ సిబ్బందిని నియమించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హెలిప్యాడ్ ప్రాంతం సందర్శన....

హెలిప్యాడ్ ఏర్పాటు చేయబోయే ప్రాంతాన్ని కలెక్టర్ గిరీషా పీఎస్ సందర్శించి సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ, ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల పరిశీలన

పులివెందుల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 9,10 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారని, ఆయన పర్యటించే ప్రాంతాలను మంగళవారం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేష్‌కుమార్, భరద్వాజ్‌లతో కలిసి పరిశీలించారు. ముందుగా భాకరాపురంలోని హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం ముద్దనూరు రోడ్డులో ఏపీ కార్ల్‌లోని స్వామి నారాయణ గురుకుల విద్యాపీఠంకు సంబంధించి పనులను, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెంట్రల్ డైరీ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఏపీకార్ల్‌లోని ఆదిత్య బిర్లా టెక్స్‌టైల్స్ వ్యవసాయ ఉద్యానవన కళాశాల ప్రాంగణాలను పరిశీలించారు. అలాగే శిల్పారామంలో ముఖ్యమంత్రి ప్రారంభించే అభివృద్ధి పనులు జిప్‌లైన్, వైఎస్సార్ విగ్రహం, మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్‌లను పరిశీలించారు. అనంతరం భాకరాపురంలోని శ్రీకృష్ణుని ఆలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్ రెడ్డి, పులివెందుల ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, జెడ్పీసీఈఓ సుధాకర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, మున్సిపల్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పీఆర్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

వేంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు అధికారులను ఆదేశించారు. ఎస్పీతో కలిసి ఇడుపులపాయలోని హెలిప్యాడ్, వైఎస్సార్ ఘాట్, సీఎం బస చేసే గెస్ట్‌హౌస్, నూతనంగా నిర్మితమైన ఆర్కే వ్యాలీ పోలీస్‌స్టేషన్, నెమళ్ల పార్కులో ప్రజాప్రతినిధులతో రివ్యూ మీటింగ్ సభా ఏర్పాట్లను పరిశీలించారు . అనంతరం సీఎం పర్యటనలో ఉన్న వారందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, వేంపల్లె తహసీల్దార్ ఎస్.చంద్రశేఖరరెడ్డి, డీఎస్పీ రమణయ్య, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, రూరల్ సీఐ గోవిందరెడ్డి, వేంపల్లె సీఐ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు

వైఎస్ జగన్ బీసీల పక్షపాతి

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

తంబళ్లపల్లె: రాష్ట్ర చరిత్రలో బీసీల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిస్తే, బీసీల ద్రోహిగా చంద్రబాబు మిగిలిపోయారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. ఈ నెల 10వ తేదీ పెద్దతిప్పసముద్రం నుంచి ములకలచెరువు వరకు జరిగే సామాజిక సాధికార బస్సుయాత్ర నేపథ్యంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితోకలిసి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్వగృహానికి వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగానే కాక ప్రతిపక్ష నాయకుడిగా కూడా విఫలమయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికోసం ప్రత్యేక దృష్టితో, చిత్తశుద్ధితో సీయం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సామాజిక సాధికారతను సాధించిన ఘనత సీయం దక్కించుకున్నారన్నారు. 10వ తేదీ పీటీయం, ములకలచెరువు వరకు జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రలో మంత్రి ఉషశ్రీ, జయరామ్, అనిల్‌కుమార్‌యాదవ్, అఫీజ్‌ఖాన్, రాంబాబు తదితర నేతలు పాల్గొంటారన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతంచేసేందుకు పార్టీశ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీన వర్గాల ప్రజలు అత్యధికంగా వచ్చేలా చూడాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదింటి విద్యార్థికి అరుదైన గౌరవం



గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా రాజ్యపురస్కార్ అవార్డు అందుకుంటున్న కార్తీక్

బద్వేలు అర్బన్: వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన పేదింటి విద్యార్థికి అరుదైన గౌరవం లభించింది. స్థానిక శివానగర్‌కు చెందిన శ్రీనివాసులు, నారాయణమ్మ కుమారుడైన నీలి కార్తీక్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇతని తండ్రి ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కార్తీక్ పాఠశాలలో స్కౌట్స్‌అండ్‌గైడ్స్‌లో శిక్షణ తీసుకుంటూ రాజ్యపురస్కార్ అవార్డుకు ఎంపికయ్యాడు. స్కౌట్స్‌అండ్‌గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతులమీదుగా కార్తీక్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం జి.వెంకటసుబ్బారెడ్డి విద్యార్థి సేవలను కొనియాడారు.స్కౌట్‌మాస్టర్ కొలిశెట్టి శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాదులను ఆదుకున్న జగనన్న



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్

మదనపల్లె సిటీ : రాష్ట్రంలో న్యాయవాదులను ఆదుకున్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు వి.సి.రెడ్డప్పరెడ్డి అధ్యక్షతన మదనపల్లె కోర్టు సమీపంలో లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా న్యాయవాదుల సంక్షేమం కోసం ఆలోచించలేదని, ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే న్యాయవాదులను లా నేస్తం పథకం ద్వారా ఆదుకున్నారని పేర్కొన్నారు. త్వరలో లీగల్‌సెల్ కమిటీలతో పాటు నియోజకవర్గ లీగల్ సెల్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మదనపల్లె, తంబళ్లపల్లె న్యాయవాదులు డి.ఆర్.ప్రసాద్ రెడ్డి, చైతన్యకుమార్‌రెడ్డి, నాగమునిరెడ్డి, సింగారయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వల వేసి.. డబ్బు లాగేసి..

ముచ్చటైన కమీషన్‌లు.. కళ్లెదుటే లాభాలు.. చుట్టు పక్కల వాళ్లను జత చేస్తే బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు. తేరగా వస్తున్న డబ్బును చూసి చాలా మందికి ఆశ కలిగింది. ఒకరిని చూసి మరొకరు చేరుతుండటంతో.. కంపెనీ వేగంగా విస్తరించింది. నోటి మాట ద్వారానే విస్తృత ప్రచారం కలిగింది. వ్యాపారం రూ.కోట్లకు చేరింది. అంతా సజావుగా సాగుతున్నట్టు అనిపించినా.. ఒకానొక రాత్రి కంపెనీ చీకట్లో కలిసిపోయింది. బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

- 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ పేరిట మోసం
- గొలుసు విధానం ద్వారా విస్తరణ
- ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ మోసగాళ్లు

రాయచోటి టౌన్ : 9 ఎఫ్ఎక్స్ ట్రేడర్స్ పేరుతో ప్రజలను మోసం చేసిన వారిని అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మహబూబ్ బాషా మంగళవారం వివరాలు వెల్లడించారు. తిరుపతికి చెందిన రసూల్ సాహెబ్ 2019లో యోగానంద చౌదరితో కలిసి 9 ఎఫ్ఎక్స్ పేరుతో ఓ కంపెనీ ప్రారంభించారు. కొందరిని ఏజెంట్లుగా చేర్చుకున్నారు. 20 మంది ఖాతాదారులతో ఒక గ్రూప్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరితో రూ.1 లక్ష వసూలు చేశారు. ప్రతి నెల లక్కీడిప్ తీస్తారు. డిప్ తగిలిన వారికి పెట్టుబడి తిరిగివ్వడంతోపాటు మరో రూ.50 వేలు అదనంగా ఇచ్చి స్కీమ్ నుంచి తొలగిస్తారు. మిగిలిన 19 మందికి నెలకు రూ.3 వేలు చొప్పున కమీషన్ ఇస్తారు. అలాగే వీరిని పరిచయం చేసిన వారికి రూ.2000, రూ.1000 చొప్పున కమీషన్ ఇస్తారు. ఇలా 20 నెలలు నిర్వహించి సభ్యుడికి తాను పెట్టిన పెట్టుబడితో పాటు మరో రూ.లక్ష వచ్చే విధంగా ఆశ చూపారు.

బ్రాంచ్‌లు ఏర్పాటు

రాయచోటికి చెందిన సుబ్బారెడ్డి ద్వారా తిరుపాల్‌రెడ్డి, ఆయన ద్వారా కడపకు చెందిన చంద్రమౌళీశ్వరరెడ్డి, అతని ద్వారా నెల్లూరుకు చెందిన మల్లికార్జునరావు, రాయ చోటికి చెందిన రాజేష్ యజమానులుగా వారికి వారే మార్చుకొని బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. వీరు మొదట తిరుపతి, తరువాత నెల్లూరు, కడప, రాయచోటిలలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేశారు. ఏజెంట్ల సంఖ్య 302 మందికి చేరింది. మొత్తం 1759 మంది ఖాతాదారులను చేర్చుకుని, రూ.170 కోట్లకు పైగా వసూలు చేశారు. సభ్యులు చెల్లించిన డబ్బులతో చెప్పిన విధంగా స్కీం నిర్వహించారు. రూ.105 కోట్ల వరకు తిరిగి ఇచ్చేశారు. ఇందులో నుంచి రూ.65 కోట్లు ఏజెంట్లు, ప్రమోటర్లకు ఇచ్చారు. అప్పటి నుంచి వీరి లావాదేవీలు, వ్యాపారం ఆగిపోయింది. వినియోగదారులకు చెప్పకుండానే.. 2023 ఏప్రిల్‌లో బోర్డు తిప్పేశారు.

ప్లాట్లు తెరపైకి తెచ్చి..

తరువాత రసూల్ సాహెబ్, యోగానంద చౌదరి కలిసి మిగిలిన డబ్బుతో నెలూరు జిల్లా నందిపాడు వద్ద 22 ఎకరాల పొలం కొనుగోలు చేశారు. దానికి గోల్డన్ ఫాం అండ్ డెవెలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఎర్రచందనం చెట్లు నాటించి, దానికి మల్లికార్జునరావుని డైరెక్టర్‌గా నియమించారు. ఆ 22 ఎకరాలలో ప్లాట్లు వేసి, వాటిని మిగిలిన సభ్యులకు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మళ్లీ బోర్డు తిప్పేయడంతో సభ్యులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రసూల్ సాహెబ్, యోగానంద చౌదరి, సుబ్బారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మల్లికార్జునరావు, రాజేష్‌ను అదుపులోకి తీసుకొని, కోర్టులో హాజరు పరిచారు. సమావేశంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

- గొంతుకోసి చంపేందుకు ప్రయత్నం
- సకాలంలో స్పందించిన పోలీసులు
- బాధితురాలి పరిస్థితి విషమం



ధనుంజయ(ఫైల్)



ఘటనా స్థలంలో రక్తపు మడుగులో గౌతమి

మదనపల్లె : కట్టుకున్న భార్యపై అతి కిరాతకంగా గొంతు కోసి చంపేందుకు భర్త ప్రయత్నించిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలం పోతబోలు జగనన్న కాలనీ లేఅవుట్‌లో జరిగింది. వెంటనే విషయం తెలుసుకున్న సచివాలయ మహిళా పోలీస్ స్నేహ.. తాలూకా పోలీసులకు సమాచారం అందించింది. తాలూకా ఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. పట్టణంలో సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో నివాసం ఉంటున్న గాజుల ధనుంజయకు, కర్ణాటక లక్ష్మీపురం తాలూకా పచ్చార్లమాకులపల్లెకు చెందిన నారాయణస్వామి, వెంకటక్ష్మి కుమార్తె గౌతమి(28)తో 2011లో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు మగపిల్లలు పృథ్వి(7), యతీష్(4), పేరుపెట్టని మరో అబ్బాయి(1) ఉన్నారు. ధనంజయ గతంలో కారు మెకానిక్‌గా పని చేసేవాడు. ఇటీవల క్షుద్రపూజలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో గత రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. అదనపు కట్నం కోసం ధనుంజయ భార్యను వేధించడంతో గతంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. భర్తతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో ధనుంజయ అనంతపురం జిల్లా మడకశిరకు చెందిన మరో యువతిని వివాహం చేసుకుని ఎస్టేట్‌లో ఆమెతో నివాసం ఉంటున్నాడు. అయినా, మొదటి భార్య గౌతమిని ఫోన్‌లో బెదిరిస్తూ, తరచూ వేధింపులకు పాల్పడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో గౌతమికి ప్రభుత్వం మండలంలోని పోతబోలు జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణాన్ని గౌతమి పునాదుల వరకు చేసింది. దీన్నిచూసి ఓర్వలేని భర్త ధనుంజయ దురుద్దేశంతో పునాదిని ధ్వంసం చేశాడు. ఈ విషయమై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో గౌతమి ఫిర్యాదు చేసింది. మంగళవారం ఆమె తిరిగి పునాదులు నిర్మించేందుకు పోతబోలు జగనన్న లేఅవుట్‌కు చేరుకుంది. కూలీలతో మట్టిని తోలి, పనులు చేయిస్తుండగా, అక్కడకు చేరుకున్న భర్త గొడవకు దిగాడు. ముందుగా వెంటతెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేసి కర్కశంగా గొంతుకోశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే రక్తపుమడుగులో కుప్పకూలి, విలవిలలాడుతుండగా సమాచారం తెలుసుకున్న సచివాలయ మహిళా పోలీస్ స్నేహ తాలూకా పోలీసులకు సమాచారం తెలిపింది. ఎస్ఐ సుధాకర్ వెంటనే అక్కడికి చేరుకుని బాధిత మహిళను జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. నిందితుడు ధనుంజయపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జపనీస్ భాషతో ఉద్యోగాల వెల్లువ



మాట్లాడుతున్న నిర్మల్ ఎఫ్రాయిమ్

కురబలకోట : సాంకేతిక, ఇంజినీరింగ్ పరిశ్రమల వైపు శరవేగంగా దూసుకెళుతున్న జపాన్‌లో ఉపాధి, ఉద్యోగాల సాధనకు జపనీస్ భాష నేర్చుకుంటే ఎంతో ఉపయోగ పడుతుందని ఆదేశ ప్రొఫెసర్ నిర్మల్ ఎఫ్రాయిమ్ అన్నారు. మంగళవారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ భాషల ప్రాముఖ్యతపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జపాన్‌లో అనేక జపనీస్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కంపెనీలు గ్లోబల్ ఉనికి కలిగి ఉన్నాయన్నారు.

ఒంటరితనాన్ని ఓడించలేకే..!

- నా అన్న వారు ఎవరూ లేరనే భావనతోనే రెడ్డమ్మ ఆత్మహత్యాయత్నం
- రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని
- నిలకడగా ఆరోగ్యం



రెడ్డమ్మ తోటి విద్యార్థినులను విచారణ చేస్తున్న స్టేట్ జాయింట్ సెక్రటరీ శివరావు

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలం ఆడపూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఆమె ఒంటరితనాన్ని ఓడించలేకే.. ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె మండలం రాజుపాలెంకు చెందిన ఎం.అంకన్న, ఎం.లక్ష్మీదేవి కుమార్తె రెడ్డమ్మ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. తల్లి తన చిన్నప్పుడే చనిపోగా, తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఒంటరైపోయింది. దీంతో జీవితంలో తనకు ఎంత కష్టమొచ్చిందో అని మథనపడేది. రెడ్డమ్మను గార్డియన్ చంద్రశేఖర్ నందలూరు మండలం ఆడపూరు వద్దనున్న అంబేద్కర్ గురుకులంలో చేర్పించారు. చేరినప్పటి నుంచి ఒంటరిగా ఉండటం అలవాటు చేసుకోకపోవడం, తన తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటూ తనకెవరు లేరన్న మానసిక ఆందోళనను పెంచుకుంది. ఈ క్రమంలో సోమవారం గురుకులంలోని డార్మెంటరీ భవనం పైనుంచి కిందకు దూకింది. ఈ సంఘటనలో అమ్మాయిని బాబాయ్ ఆస్తి కోసం వేధింపులకు గురిచేస్తున్నాడా అనే కోణంలో కూడా విచారణ కొనసాగింది. ఇప్పుడు రిమ్స్‌లో చికిత్సపొందుతోంది.

జేఎస్ శివరావు పరిశీలన:

ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సొసైటీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో మంగళవారం జాయింట్ సెక్రటరీ శివరావు, నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయ భాస్కర్‌రెడ్డిలు ముమ్మరంగా పరిశీలన చేశారు. రెడ్డమ్మ దూకిన భవనం పైఅంతస్తును పరిశీలించారు. తోటి విద్యార్థులను విచారణ చేవారు. అనంతరం గురుకులం నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులంలో ఉన్న విద్యార్థినులను తమ కన్నబిడ్డల్లా కంటిరెప్పలా చూసుకోవాలన్నారు. వారికి విద్య, ఆరోగ్యం తదితర అంశాలన్నింటిని నిశితంగా పరిశీలించాలన్నారు. రెడ్డమ్మకు ప్రభుత్వం అన్ని విధాలుగాఅండగా ఉంటుందన్నారు. ఆరోగ్యంగా కోలుకునే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా సమన్వయ అధికారి సుకన్య, ప్రిన్సిపాల్ హైమావతిలను జాయింట్ సెక్రటరీ శివరావు విచారణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నాయకులు సోమిశెట్టి ప్రభాకర్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, పల్లె మాధవి, ఎస్సీ నేతలు ఆర్ముగం విశ్వనాథ్, కాకి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డమ్మను పరామర్శించిన ఎంపీపీ మేడా

కడపలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రెడ్డమ్మను నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి పరామర్శించారు. భయపడవద్దని, కోలుకున్న తర్వాత యథావిధిగా విద్యను అభ్యసించుకోచ్చునన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లి శాఖపరంగా నీకు అందాల్సిన అన్ని సహాయక చర్యలను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థి పరిస్థితి నిలకడగానే ఉందన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సోమశేఖర్

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. కురబలకోట మండలం వనమరెడ్డిగారిపల్లె పంచాయతీ నడింపల్లెకు చెందిన ఉప్పుతోళ్ల సోమశేఖర్(45) అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఘటన జరిగింది. ఆయన స్థానికంగా ఇటుకలబట్టీల్లో పని చేస్తూ భార్య లక్ష్మీదేవి, కుమార్తెలను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో స్థానికంగా చేసిన అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఊరికి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి ఉరి నుంచి తప్పించి బాధితుడ్ని 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

■ మదనపల్లె పట్టణంలోని దేవతానగర్‌కు చెందిన మైనర్ బాలిక (17) తల్లి దండ్రులు మందలించడంతో మంగళవారం విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అనపగుట్టకు చెందిన ఫయాజ్‌అహ్మద్ భార్య ఎస్.తాసీన్‌తాజ్ (36) కుటుంబ సమస్యలతో సోమ వారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు చెందిన తిమ్మయ్య కుమారుడు టి.కొండప్ప(65) పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తంబళ్లపల్లె మండలం అమ్మనగారిపల్లెకు చెందిన గంగులప్ప భార్య సరస్వతి(42) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె/రామసముద్రం : వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. రామసముద్రం దిగువపేటకు చెందిన టైలర్ షామీర్(40) స్థానికంగా టైలర్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. తన భార్య మున్నీ(38)తో కలిసి నరసాపురం మోడల్ స్కూల్‌లో చదువుతున్న తన కుమారుడు సైఫుల్లాను ఇంటికి తీసుకువచ్చేందుకు బయలుదేరి వెళ్లారు. మార్గం మధ్యలో మోడల్‌స్కూల్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. షామీర్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. అదే విధంగా పీటీఎం మండలం రంగసముద్రం పంచాయతీ బొంతలవారిపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ(50) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో పీటీఎం నుంచి వస్తుండగా, మార్గంమధ్యలో సాన్నువారిపల్లె క్రాస్ వద్ద మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం మల్లసముద్రంకు చెందిన శ్రీనివాసులురెడ్డి(60), తనకు బంధువైన హారిక(36)తో కలిసి ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి మల్లసముద్రంకు వెళుతుండగా.. మార్గంమధ్యంలోని నల్లగుట్టపల్లె వద్ద కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

భూతగాదాతో కొడవళ్లతో దాడి

కురబలకోట : భూ తగాదాతో ఇరు వర్గాలకు చెందిన వారు మంగళవారం రాత్రి గొడవ పడ్డారు. కొడవళ్లతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ఇరు వర్గాలకు చెందిన 10 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురబలకోట మండలం దాదంవారిపల్లె పంచాయతీ భద్రయ్యగారిపల్లెకు చెందిన ఇరు వర్గాల మధ్య కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. పగలంతా పని ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరిన వారు.. చీకటి పడుతుండగా భూ తగాదా విషయమై గొడవ పడ్డారు. మాటకుమాట పెరిగి కొడవళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఓ వర్గానికి చెందిన జి. వెంకటరమణ, జి.హరిబాబు, కృష్ణప్ప, శివశంకర్, మరో వర్గానికి చెందిన పి.రెడ్డెప్ప, కదిరప్ప, నరసింహులు, ప్రసాద్, మోహన్, శ్రీనివాసులు గాయపడ్డారు. వారిని కుటుంబ సభ్యులు మదపనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఓబులవారిపల్లె : మండలంలోని జె.వడ్డిపల్లె గ్రామంలో ఓ వ్యక్తి అప్పుల బాధతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి లక్ష్మీనారాయణ (26)కు అప్పులు అధికం కావడంతో ఈ నెల 3న విష ద్రావణం తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. లక్ష్మీనారాయణ నాలుగేళ్లుగా వ్యవసాయంలో లాభాలు రాక అప్పులు అధికం కావడంతో కలత చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, కుమార్తె ఉన్నారు.